ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 87
సంచిక : 205
పేజీలు : 3
గురువారం, ఏప్రిల్ 09, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఏసీబీ వలలో విద్యాశాఖాధికారులు



**టీ మీడియా, ఏప్రిల్ 8, మహబూబాబాద్** : పించను పత్రాలు సిద్ధం చేసేందుకు పదిహేను వేల రూపాయలు లంచం తీసుకుంటూ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల విద్యాశాఖాధికారి, అయోధ్యపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.రవికుమార్, అదే పాఠశాల సహాయకుడు జి.చంద్రమౌళి బుధవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. గూడూరు పాఠశాల ఆవరణలో బాధితుడి నుంచి లంచం స్వీకరిస్తుండగా వరంగల్ దర్యాప్తు అధికారులు వలపన్ని పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి వరంగల్ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

**-దిశ సమావేశంలో ఎంపీ రఘురాంరెడ్డి**

**-హాజరైన మహబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు**

**టీ.మీడియా,ఏప్రిల్8,భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో దిశా సర్వసభ్య సమావేశం బుధవారం జిల్లా కేంద్ర ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎంపీ రామ సహాయం రఘు రాం రెడ్డి అధ్యక్షత వహించారు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కో-చైర్మన్‌గా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, దిశా కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.సమావేశంలో గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి సమగ్రంగా సమీక్షించబడింది. ఎంపీ రామ సహాయం రఘు రామ్ రెడ్డి జిల్లా అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పనుల పురోగతిని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు



సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.మణుగూరు, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత, ఆహార నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, అంబులెన్స్, డయాలసిస్ సేవల విస్తరణ, సికిల్ సెల్ అనీమియా, హెచ్పీవీ వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి అని సూచించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల కింద తాగునీటి సరఫరా మరియు పైప్‌లైన్‌లీకేజీలను తొలగించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో త్రాగునీటి సరఫరా పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.

మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూలి , కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, మారుమూల ప్రాంతాల వరకు త్రాగునీటి సరఫరా కల్పించాలని, ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయడం కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రాధాన్యతగా తీసుకుని వాటి అమలును వేగవంతం చేయాలని, ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

శాసన సభ్యులు తమ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే



ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు తమ నియోజకవర్గాల్లో పథకాల అమలు స్థితిగతులపై అధికారుల నుంచి సవివర నివేదికలు కోరారు.ఈ సమావేశంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, అశ్వారావుపేట మున్సిపల్ చైర్ పర్సన్ శశికళ, డి ఆర్ డి ఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, దిశా కమిటీ సభ్యులు బుర్ర సురేష్, యేసుమని, స్వర్ణ జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ. ..**

# బస్ షెల్టర్ కరువు

**బస్సుల వెనుక ప్రయాణికుల పరుగులు**

**టీ మీడియా ,ఏప్రిల్ 8, జూలూరుపాడు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో ప్రయాణికుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. మండల కేంద్రం నుండి రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు కనీసం నీలువ నీడ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

**నిర్దేశిత స్థలం లేక అయోమయం**

?బస్సు షెల్టర్ లేకపోవడంతో బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ప్రయాణికులు ఒకచోట వేచి ఉంటే, డ్రైవర్లు బస్సులను మరోచోట నిలుపుతున్నారు. దీంతో బస్సు ఎక్కేందుకు వృద్ధులు, మహిళలు, పిల్లలు బస్సు వెనుక పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఒక్కోసారి బస్సు దొరకక్క ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**రోడ్డు విస్తరణతో కష్టాలు**

?నాలుగు ఏళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో రహదారి పక్కనే ఉన్న పాత బస్ షెలర్‌ను అధికారులు తొలగించారు. అనంతరం నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్తి

మిగతా 3లో

# అరుదైన గౌర్ జాతి అడవి దున్నలు

**-ఉనికిని నిర్ధారించిన అటవీ శాఖ**

**టీ మీడియా, ఏప్రిల్ 8, సత్తుపల్లి:** అటవీ రేంజ్ పరిధిలో అరుదైన గౌర్ జాతి అడవి దున్నలు సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఇటీవల కాలంలో వీటిని పలుమార్లు చూసినట్లు స్థానికులు కూడా తెలిపారు. గౌర్‌లను ఇండియన్ బైసన్‌లు అని కూడా అంటారు. ఇవి సాధారణంగా దట్టమైన అటవీ ప్రాంతాల్లో నివసించే భారీ వన్యప్రాణులు. అడవి దున్నలు సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామస్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, అటవీ ప్రాంతాలకు దగ్గరగా నివసించే ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. గౌర్‌ల సంచారం ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దని, ఒకవేళ అవి ఎదురైతే వాటిని రెచ్చగొట్టకుండా దూరంగా ఉండాలని సూచించారు. రైతులు తమ పశువులను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లేటప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అరుదైన గౌర్‌ల సంచారం వన్యప్రాణి సంరక్షణ ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. అటవీ శాఖ గౌర్‌ల కదలికలను నిశితంగా పర్యవేక్షిస్తూ, మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణలను నివారించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గౌర్ బరువు సాధారణంగా 600 నుంచి 1000 కిలోల వరకు ఉంటుంది. భుజాల ఎత్తు 6 అడుగుల వరకు ఉంటుంది. గాఢమైన గోధుమ లేదా నలుపు రంగులో ఉండి.. కాళ్ల వద్ద తెల్లటి “సాక్స్” లాగా కనిపించే గుర్తులు ఉంటాయి మగ గౌర్‌లు ఆడ గౌర్‌ల కంటే చాలా పెద్దగా, బలంగా ఉంటాయి. ఇవి సాధారణంగా దట్టమైన అటవీ ప్రాంతాలు, కొండ



ప్రాంతాలు ఇష్టపడతాయి. చిన్న గుంపులుగా సంచరిస్తాయి. ఉదయం, సాయంత్రం సమయంలో ఎక్కువగా యాక్టివ్‌గా ఉంటాయి. సాధారణంగా గౌర్‌లు శాంత స్వభావం కలిగినవే.. కానీ ప్రేరేపిస్తే లేదా భయపెడితే చాలా ఆగ్రహంగా మారి దాడి చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తమ పిల్లలున్నప్పుడు మరింత అగ్రెసివ్‌గా ఉంటాయి. ఇవి పూర్తిగా శాకాహారులు. గడ్డి, ఆకులు, చిన్న మొక్కలు తింటాయి. గౌర్‌లు ప్రస్తుతం అపాయ స్థితిలో ఉన్న జాతి. అడవుల నాశనం, వేట కారణంగా సంఖ్య తగ్గుతోంది ప్రపంచంలోనే అతిపెద్ద అడవి పశువులలో ఒకటైన గౌర్‌లు సత్తుపల్లి అటవీ ప్రాంతంలో కనిపించడం వన్యప్రాణి వైవిధ్యానికి సూచికగా అధికారులు భావిస్తున్నారు.




# స్మార్ట్ కిడ్జ్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

## విద్యార్థుల ఫోటోలతో మెమెంటోల బహుకరణ

**టీ.మీడియా,ఏప్రిల్8, ఖమ్మం:**స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బుధవారం ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సంబరంగా జరిగాయి. గత తొమ్మిది సంవత్సరాలుగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని చివరి ప్రైమరీ విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ప్రైమరీ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రత్యేక గ్రాడ్యుయేషన్ వస్త్రధారణలో నెత్తిపై గ్రాడ్యుయేషన్ టోపీ ధరించి ఈ వేడుకలలో నేత్రపర్వంగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యార్థుల ఫోటోలతో మెమెంటోలు బహుకరించడంతో వారి ఫోటోలతో ఉన్న మెమెంటోను అందుకున్న విద్యార్థులు మురిసిపోయారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్లే గ్రూపులో చేరిన విద్యార్థులు, గత 9 సంవత్సరాలుగా విద్యార్థులు పాఠశాలలో అన్ని తరగతులను పూర్తి చేసుకుని ఐదవ తరగతిలో గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకోవడం హర్షనీయమన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చదువుతోపాటు క్రీడా,సాంస్కృతిక, ఒలంపియాడ్, ఇన్స్పైర్-సైన్స్ ఎక్స్పో, మహనీయుల జయంతోత్సవాలు, పర్వదినాలు, వార్షికోత్సవాలు నిర్వహించి విద్యార్థులను ఆల్రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. తమ పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూ తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని, ఇదేవిధంగా భవిష్యత్తులోనూ తమ పాఠశాలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ట్రాక్టర్-ఆర్.టి.బస్ డి వ్యక్తి మృతి

**టీ.మీడియా,ఏప్రిల్ 8, మధిర:**మండల పరిధిలోని మాటూరు క్రాస్ రోడ్ బోర్డర్ వద్ద ఆర్టీసీ బస్సు ట్రాక్టర్లను ఢీకొన్న ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మాటూరుపేట గ్రామానికి చెందిన శీలం శంకర్ రెడ్డి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది... శంకర్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం... పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



# షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా. సమీకృత గురుకులాలు





### -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టీ.మీడియా,ఏప్రిల్8, ఖమ్మం:**పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.బుధవారం పాలేరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం పోనేకల్ లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను తిరుగుతూ పనుల నాణ్యతను, క్షేత్రస్థాయిలో భవనాల నమునా మ్యాప్ లను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్డు, విద్యుత్ సరఫరా ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, పాలేరు నియోజకవర్గం ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే విద్యా వ్యవస్థలో ప్రపంచానికి పోటీ పడే విధంగా మన విద్యార్థులను తయారు చేసుకునేందుకు అవసరమైన ప్రణాళికలు, మౌళిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని , భవిష్యత్తులో ఉత్తమమైన చదువు అందించే ఉద్దేశంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు విద్యను అందించేందుకు సమీకృత విద్యా సంస్థలను ఏర్పాటు చేసే సంకల్పానికి అధికారులు సమన్వయంతో పని చేసి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఖమ్మం జిల్లా పరిధిలో ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు అయి నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యలో సమూలమైన విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వస్తాయని, పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు నాణ్యమైన నిర్మాణ పనులతో పూర్తి చేసి సకాలంలో అందించేలాగ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి పిల్లలకు అందుబాటులో తీసుకురావాలని, నిర్ణిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని, పనుల పురోగతి వివరాలను ఎప్పటి కప్పుడు నివేదికలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు యం. వినయేందర్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పూర్తి స్థాయిలో అమలు చేయాలి




### -ఏపూరి లతాదేవి డిమాండ్

**టీ.మీడియా,ఏప్రిల్8, ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఎడబ్ల్యూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 వారి వారి ఖాతాల్లో జమ చేయాలని, తులం బంగారాన్ని కళ్యాణానికి అందించాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళా సమాఖ్య -విస్తృత స్థాయి సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన -జరిగిన సభలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలలో ఉచిత బస్సు తప్ప దేనిని అమలు చేయలేదని అది కూడా ప్రయాణం ఒక ప్రహసంగా మారిందన్నారు. ప్రయాణికులకు తగిన రీతిలో బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని లతాదేవి తెలిపారు. మహిళా చట్టాల అమలులో బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన -విబి జీ రాం జీ పథకంలో మార్పుల కారణంగా గ్రామీణ ప్రాంత మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విబి జీ రాం జీ పథకంలో రెండు సార్లు ఫోటో పద్ధతిని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పార్లమెంటు స్థానాల పునర్ వ్యవస్థీకరణలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు నిర్ణయించాలని ఇందుకు సంబంధించి బిల్ పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ రూపొందించుకునే క్రమంలో మే ఐదున కొణిజర్లలో మహిళా సమాఖ్య జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు లతాదేవి తెలిపారు. ఈ సమావేశంలో తాటి నిర్మల, మహిళా సమాఖ్య -ఇంచార్జి దొండపాటి రమేష్, నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, మందడపు రాణి, కె. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల నందు జిజ్ఞాస స్టడీ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

**టీ.మీడియా,ఏప్రిల్8, మధిర:**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో "జిజ్ఞాస స్టడీ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్" చేయబడింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. రవీంద్ర రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి స్టడీ ప్రాజెక్టుల పోటీకి పంపిన స్టడీ ప్రాజెక్టులను ఈ ఎగ్జిబిషన్లో ప్రదర్శించడం జరిగింది.విద్యార్థులు వారు తయారు చేసి ప్రదర్శించిన ప్రాజెక్టులను చూసి అధ్యాపకులు అధ్యాపకులు వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి అరుణ, జిజ్ఞాస కోఆర్డినేటర్ డా. ఎస్. ఇందిర,ఎన్ ఎస్ ఎస్ పి ఓ డా. పి.సుజాత ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# ఉపాధి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

### -పాపినేని రామ నరసయ్య

**టీ.మీడియా,ఏప్రిల్8, మధిర:**ఉపాధి హామీ పని అడిగిన వెంటనే పని కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మధిర నియోజకవర్గ కార్యదర్శి పాపినేని నరసయ్యలి కోరారు. ఎర్రుపాలెం మండల కేంద్రం కామ్రేడ్ రామిశెట్టి పుల్లయ్య భవనం నందులిఅంగోతు వెంకటేశ్వరరావులి అధ్యక్షతన ఆ సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పాపినేని రామ నరసయ్యలి మాట్లాడుతూ సామాజిక భద్రత, వలసల నివారణలో భాగంగా, కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకం పేరుతో ఉపాధి కూలీల పొట్టగొట్టే చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ చట్టానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కనీసం మంచినీటి సౌకర్యం,ప్రథమ చికిత్స కిట్టులు లేకుండా,టెంట్లులేకుండా వ్యవసాయ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఐరిష్ పేరుతో పని ప్రదేశంలో సిగ్నల్ రాకపోవటంవల్ల కొంతమంది కూలీలకు ముఖము పోటోవ్ రాకపోవటం నానా రకాలుగా ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు.పని మొదలుపెట్టినప్పుడు, ముగిసిన తర్వాత రెండు సార్లు ఫోటోలు తీయడం వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడు వారాలుగా పనిచేసిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. దూర ప్రాంతాలకు పని ప్రదేశాలకు వెళ్లే కూలీలకు ఆటో చార్జీల రూపంలో అధిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆటో చార్జీలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు.గత పది సంవత్సరాలుగా గడ్డపారలు, పారులు, తట్టలు లాంటి పనిముట్లు ఇవ్వడం లేదని వెంటనే వాటిని ఇవ్వాలని పని అడిగిన వెంటనే పనులు చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గామాసు జోగయ్య, రైతు, కార్మిక సంఘుల నాయకులు దివ్వెల వీరయ్య,మద్దాల ప్రభాకరరావు, షేక్ లాల్ సాహెబ్, మొహిద్దిన్, ఉద్దండు, దూదిగం బసవయ్య,నక్కా పుల్లారావు, కోటి సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు .





## కార్మిక సమస్యలు పట్టించుకోని ఐటీసీ యాజమాన్యం'

### 14 రోజులుగా దీక్షలు చేస్తున్నా కనీస స్పందన కరువు

**టీ మీడియా ,ఏప్రిల్ 8,బూర్గంపహాడ్ :** రెండు వారాలుగా కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రిలే దీక్షలు చేపట్టినా ఐటీసీ యాజమాన్యం ఆ సమస్యలను గాలికి వదిలేసిందని, చర్చలకు కూడా పిలవకుండా తాత్సారం చేస్తుందని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్‌పాషా అన్నారు. బుధవారం రిలే నిరాహార దీక్షలు 14వ రోజుకు చేరుకోవడంతో ఈ దీక్షల్లో తోకల నరేశ్, ప్లాంటేషన్ మహిళా కార్మికులు బోళ్ల సమ్మక్క, దార్ల కవిత, పట్రా సుమిత్ర, గంధం సిరి పాల్గొని మద్దతు పలికారు.ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ.. నిరసనలు 14 రోజులు పూర్తయినా ఐటీసీ యాజమాన్యం నుండి ఎలాంటి పిలుపులేదని, కార్మికుల సహనాన్ని పరీక్షిస్తే ముందుముందు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా ఐటీసీ యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రిలే దీక్షల్లో జేఏసీ సభ్యులు ఆకిని సర్వేశ్వరరావు, కందాల వెంకటరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, మర్రి వెంకటరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, సూరిశెట్టి జగదీష్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## కో ఆప్షన్ సభ్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ

**టీ మీడియా ,ఏప్రిల్ 8,ఖమ్మం రూరల్** : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు కో ఆప్షన్ సభ్యుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ పురపాలక చట్టం ప్రకారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నాలుగు కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. వారిలో ఇద్దరు మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక అనుభవం(విద్యావంతులు ), మరో ఇద్దరు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఈ రెండు కేటగిరీలకు సంబంధించి ఒక మహిళా సభ్యులు ఖచ్చితంగా ఉండాల్సి ఉందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మున్సిపాలిటీ పరిధిలో ఓటరు అయి ఉండాలని, 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు.తెలంగాణ పర్యాటకంప్రత్యేక పరిజ్ఞానం కేటగిరికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గతంలో మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్, పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుడు లేదా అడ్వకేట్ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంఘాల్లో ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసిన వారు అర్హులన్నారు. అల్ప సంఖ్యాక వర్గాలకు సంబంధించి ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధం, పార్సీ మతాలకు చెందిన వారై ఉండాలన్నారు. వీరు సైతం మున్సిపాలిటీ పరిధిలో ఓటరై ఉండి 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పూర్తి దరఖాస్తు ఫారం తో పాటు అర్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు జతపరిచి కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**టీ మీడియా ,ఏప్రిల్ 8, ములకలపల్లి:** మండలంలోని సీతారాంపురం పంచాయతీ సుబ్బనపల్లి గ్రామంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ చలివేంద్రాన్ని సర్పంచి కుంజా రవి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఆర్ అండ్ బి రహదారి వెంబడి ప్రయాణించే ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గ్రామస్తులు,ఈ చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. పంచాయతీ కార్యదర్శి కందుకూరి రాంబాబు, అంగన్వాడీ టీచర్ ఉపేంద్ర, కొండ్రు భాస్కర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దగోపతి ఆరోగ్య కేంద్రంలో మెగా వైద్య శిబిరం.

**టీ మీడియా, ఏప్రిల్ 8 ,కొణిజర్ల** : పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కే. రాధాకృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పెద్దగోపతి గ్రామ సర్పంచ్ వెలినాటి సునీత ఖమ్మం డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వేణుమాధవ్ సంయుక్తంగా ప్రారంభించారుఈ శిబిరంలో జనరల్ వైద్యులు, స్త్రీ వైద్య నిపుణులు, దంత వైద్యులు, ఎముకల వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్యులు, కంటి వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించారు. మొత్తం 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి : దైద రవీంద్ర

**టీ మీడియా ,ఏప్రిల్ 8,సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో నియోజకవర్గ ఇంచార్జ్ దైద రవీంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచనలతో నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల ముఖ్య సమావేశం జరిగినది. ఈ సమావేశంలో ఇంచార్జ్ రవీంద్ర మాట్లాడుతూ... ముఖ్యంగా మళ్లీ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.ముఖ్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లు, కౌన్సిలర్లు, వార్డ్ మెంబర్స్, కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యక్రమాల్ని, ప్రభుత్వ పథకాలను ప్రజలకి అర్థమయ్యేలా అవగాహన కల్పించేటట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని దిశా నిర్దేశించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ గాదె చెన్నారావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా బేగం కమల్ పాషా వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దేవస్థానం భూములు వేలంపాట



**టీ మీడియా ,ఏప్రిల్ 8, ఎర్రుపాలెం:** మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం భూములు కౌలుకు ఇచ్చుటకు వేలంపాట నిర్వహిస్తున్నామని దేవస్థానం చైర్మన్, ఈవో పేర్కొన్నారు. బుధవారం నాడు జరిగే వేలం పాటలో శివాలయం నందు దేవస్థానానికి ఉన్న కేసిరెడ్డిపల్లి గ్రామంలో 27 ఎకరాల భూమికి రెండు సంవత్సరాల కాల వ్యవధికి గాను ముందుగా 10000 డిపాజిట్ చేయవలసి ఉంటుందని, ఎర్రుపాలెం లోని నాలుగెకరాల భూమికి ఐదువేల రూపాయలు డిపాజిట్ చేయవలసి ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు బుధవారం నాడు శివాలయం నందు జరిగే వేలంపాటలో పాల్గొనాలని దేవస్థానం చైర్మన్ మగినం జయశ్రీ, దేవస్థానం ఈవో పేర్కొన్నారు.

## చెరువు మట్టి పోలాలకు వినియోగించుకోవాలి

### ఇరిగేషన్ డీఈ వెంకట్‌నాయక్

**టీ మీడియా,ఏప్రిల్08,సింగరేణి(కారేపల్లి):** చెరువులలో పూడిక మట్టిని రైతులు పొలాలకు పోసుకోని సద్వినియోగం చేసుకోవాలని నీటిపారుదల శాఖ డీఈ బి. వెంకట్ నాయక్ సూచించారు. కారేపల్లి లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు పెద్ద చెరువులలో పూడిక మట్టిని రైతులు తోలుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.రైతులు ముందుగా నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు.అనుమతులు లేకుండా చెరువులలో మట్టి త్రవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇరిగేషన్ అధికారులు సూచించిన లోతు వరకు మట్టిని తవ్వకాలు జరుపుకోవాలని ఎక్కువ లోతు తీయకూడదన్నారు.



## ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ. ..

చేసుకుని మూడు ఏళ్లు గడుస్తున్నా, కొత్త బస్ షెల్టర్‌ను నిర్మించడంలో అధికారులు విఫలమయ్యారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు పట్టణాలకు వెళ్లాలంటే ఇక్కడి నుండే ప్రయాణించాలి. షెల్టర్ లేక వేసవిలో ఎండకు, వానాకాలంలో వర్షానికి తడుస్తూ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. రహదారిపై బస్సుల కోసం పరుగులు తీస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ?తొలగించిన బస్ షెల్టర్‌ను వెంటనే పునరుద్ధరించి బస్సులు ఆగేందుకు నిర్దేశిత స్థలాన్ని ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

## ఒక్క టీకా తో గర్భాశయ క్యాన్సర్ కట్

**టీ మీడియా. ఏప్రిల్ 8 .కూసుమంచి:** జీవితములో గర్భాశయ క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా బాలికలు ఒక్క టీకా తీసుకుంటే సరిపోతుందని వైద్యులు పేర్కొన్నారు. కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో బుధవారం 22 మంది బాలికలకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హ్యూ) టీకాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సాయికుమార్ మాట్లాడుతూ 14 నుంచి 15 సంవత్సరాల 90 రోజుల లోపు బాలికలు ముందు జాగ్రత్తగా ఈ టీకాను విధిగా తీసుకోవాలని కోరారు.



## బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత రైతు : - దివ్వెల వీరయ్య

**టీ.మీడియా,ఏప్రిల్8, మధిర:** బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత రైతులకు సత్వరమే నష్టపరిహారం అందించాలని స్థానిక తాసిల్దార్ రాంబాబు కలిసి ప్రమాద బీమా వివరాలను అడిగి తెలుసుకుని సత్వరమే న్యాయం చేయాలని స్థానిక తాసిల్దార్ని కోరడం జరిగింది.బాలాజీ కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ ఉంచుకున్న తెలంగాణ, ఆంధ్ర రైతులు సంబంధించిన మిర్చి సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం ద్వారా దగ్ధం కావడం అందరికి తెలిసిన విషయమే. దీని కోసం ప్రమాద బీమా వర్తించటం కోసం రైతులు తమ వద్ద ఉన్న బాండు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకాల జిరాక్సను మధిర తాసిల్దార్ కార్యాలయంలో త్వరగా అందించాలని, అట్లా అందించిన రైతులను గుర్తించి ప్రమాద బీమా కంపెనీకి పంపించడం జరుగుతుందని కావున రైతులందరూ తొందరగా తాసిల్దార్ కార్యాలయానికి అందించగలరని కమిటీకి తెలియజేయడం జరిగింది. కావున రైతులందరూ ఈ విషయాన్ని గమనించి కమిటీకి మరియు అధికారులకు సహకరించగలరని కోరుతున్నాము.మధిర తాసిల్దార్ రాంబాబు గారిని కలిసిన వారిలో బాలాజీ కోల్డ్ స్టోరేజ్ పోరాట కమిటీ కన్వీనర్ దివ్వెల వీరయ్య,కోకన్వీనర్ గువ్వల సీతారాం రెడ్డి పడకండి మురళి తదితరులు పాల్గొన్నారు.

## పోటు రంగారావు పై ఉపా చట్టం కింద కేసు

### సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఖండన

**ఖమ్మం:** సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై జాతీయ దర్యాప్తు సంస్థ ఉపా చట్టం కింద కేసు, నోటీసు జారీ చేయడాన్ని సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ తరఫున, తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ఒక ప్రకటన లో తెలియజేశారు.

పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులపై ఇలాంటి దేశద్రోహం తరహా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న వారిని కేసులు, బెదిరింపులతో అణచివేయాలని ప్రయత్నించడం సరైంది కాదు. ఇది ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్య.

పోటు రంగారావు వంటి ప్రజా నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి కాకుండా, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని నున్నా తన ప్రకటన లో కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

### - పోలంపల్లి సర్పంచ్



**టీ మీడియా,ఏప్రిల్8,సింగరేణి(కారేపల్లి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతుందని కారేపల్లి మండలం పోలంపల్లి సర్పంచ్ దారావత్ హేమలతబాలాజీ అన్నారు. మనబడి మన ప్రణాళికలో భాగంగా బుధవారం పోలంపల్లి తండాలో ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ సందర్శించారు.ఈసందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ బానోత్ లావణ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకం,సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం, 21 రకాల వస్తువులతో ప్రత్యేకమైన కిట్టును ప్రభుత్వం అందించనుందన్నారు. మాజీ సర్పంచ్ ధరావత్ భద్రునాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ చదువుపై దృష్టి పెట్టారని దానిలో భాగంగా 2026-2027 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకములు పెన్సిళ్లు చదువుకోడానికి అనేక రకమైన వస్తువులతో ఒక కిట్టు రూపంలో ప్రభుత్వం అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచఎం రాములు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గుగులోతు తేజ నాయక్, సక్రు నాయక్, వినాయక్ అంగన్వాడి టీచర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనాన్ని తనిఖీ చేసిన క్యూసీ అధికారి



**టీ మీడియా,ఏప్రిల్08,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన 108 వాహనాన్ని జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ క్వాలిటీ కంట్రోల్ ఆడిటింగ్ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్ లోని పరికరాలు, నిర్వహణ, మందుల లభ్యత, ఆక్సిజన్ నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు.అదేవిధంగా నెలవారీ కేసుల సగటుపై ఆరా తీశారు.108అంబులెన్స్ సిబ్బంది 24 గంటలు అప్రమతంగా ఉంటూ క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రులకు చేర్చాలని సూచించారు.తనిఖీలో అడిట్ అధికారి వెంకటేశ్వర్లు తో పాటు ప్రోగ్రామ్ మేనేజర్ నూరుద్దీన్, సూపర్వైసర్ దుర్గాప్రసాద్, 108 సిబ్బంది అనిత, సంపత్ పాల్గొన్నారు.